క్లుప్తంగా

రూ. 50వేలు విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం అభివృద్ధికి ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన భక్తులు ఇమ్మిడి శ్రీనివాసరావు, స్వరూపరాణి దంపతులు వారికుమారులు పవన్‌కుమార్, భానుప్రకాష్ పేరున రూ.50వేలు విరాళంగా శనివారం అందజేశారు. స్వామివార్లను దర్శించుకుని పూజలు చేసిన అనంతరం వారు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావును కలిసి ఈ మేరకు విరాళాన్ని అందజేశారు. ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బెల్ వ్యవస్థాపక దినోత్సవం



మచిలీపట్నంటౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న బెల్ కంపెనీ 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మెయిన్ రోడ్డు లోని బెల్ కంపెనీ ఆవరణలో అయ్యగారు రామమూర్తి పంతులు విగ్రహానికి సంస్థ జనరల్ మేనేజర్ జితేందర్ సింగ్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పెడన అసెస్సి హాస్పటల్‌లో రోగులకు మందులు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక నిక రాంజీ హైస్కూల్‌కు బీరువా, షార్కీ బాలికల హైస్కూలు హాస్టల్ విద్యార్థులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, గ్రైండర్, ప్లాస్టిక్ కుర్చీలు బహూకరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. బెల్ కంపెనీ వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెల్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ సాత్విక్‌కు ఘనసత్కారం



చల్లపల్లి: పీ4 కార్యక్రమంలో ధనికులు భాగస్వాములుగా చేరి పేదరిక నిర్మూలన కోసం కృషిచేయాలని అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు కోరారు. పీ4లో భాగస్వామిగా చేరి నలుగురు పేద విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు ముందుకు వచ్చిన చల్లపల్లికి చెందిన ఎన్ఆర్ఐ మురారి సాత్విక్‌ను స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. సాయిబాబు మాట్లాడుతూ స్వగ్రామంపై మమకారంతో పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చిన స్వాతిక్ అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీవో ఎ.వి.రమణ, సర్పంచ్ పి.కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాల్వలోపడి వ్యక్తి మృతి



మృతుడు మస్తాన్

కోడూరు: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందిన ఘటన కోడూరు మండలం పాలకాయతిప్పలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాలకాయతిప్ప గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ మస్తాన్(39)కు మతిస్థిమితం లేదు. శనివారం మధ్యాహ్నం గం.12ల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మస్తాన్, సాయంత్రం నాలుగు గంటల ఫారెస్ట్ గేటుకు ఎడమ పక్కన ఉన్న మడ అడవుల కాలువతో ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో గ్రామస్తులు బయటకు తీసి వెంటనే అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మస్తాన్ అనంతరం కొద్దిసేపటికి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తపాలా కార్యాలయానికి స్థలం వితరణ

జమీగొల్వేపల్లి(మొవ్వ): స్వగ్రామం పై మక్కువతో భారత రక్షణ శాఖ నుంచి సిపాయిగా పదవీ విరమణ చేసిన చెరుకూరి భవానీ ప్రసాద్, సుధారాణి పంపతులు జమీగొల్వేపల్లి ఉప తపాలా కార్యాలయానికి రూ.6.50 లక్షల విలువైన స్థలాన్ని వితరణగా ఇచ్చారు. ఈ మేరకు గుడివాడ డివిజన్ హెడ్ పోస్టాఫీస్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగించారు. ఈ స్థలంలో త్వరలో రూ.40 లక్షలతో నూతన తపాలా కార్యాలయం నిర్మించబోతున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. త్వరితగతిన నిధులు మంజూరు చేయించిన శ్రీనివాస్‌కి, స్థల దాతలైన శ్రీ భవానీ ప్రసాద్, సుధారాణి దంపతులకు గ్రామ ఎంపీటీసీ సభ్యుడు అరవిందబాబు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల నిలయాలుగా వసతి గృహాలు

- పనిచేయని కుళాయిలు
- హాస్టల్ ఆవరణలో పశువుల సంచారం
- ఇబ్బందుల్లో విద్యార్థులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మచిలీపట్నంటౌన్: నగరంలో సాంఘిక సంక్షేమశాఖ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సమీకృత వసతి గృహం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నగరంలోని రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ప్రాంతంలో ఈ వసతి గృహం ఉంది. రెండు సాంఘిక సంక్షేమ, ఒక బీసీ సంక్షేమ వసతి గృహాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈ సమీకృత వసతిగృహంలో 200 మంది విద్యార్థులకు వసతి అవకాశం ఉండగా ప్రస్తుతం 129 మంది విద్యార్థులు ఉన్నారు.

అందని కాస్మోటిక్స్..

విద్యా సంవత్సరం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన వస్తువులను ఇంకా సమకూర్చలేదు. విద్యార్థులకు కాస్మోట్రిక్స్‌ను ఇప్పటివరకు ఇవ్వలేదు. గతంలో విద్యార్థులకు ప్రభుత్వం వారి అకౌంట్లలో డబ్బును జమ చేసేది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు తామే నేరుగా కిట్లను పంపిణీ చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు చేయలేదు. అదేవిధంగా విద్యార్థులకు ఈ ఏడాది ఇవ్వాల్సిన దుప్పట్లు, టవర్లు అందజేయలేదు. పాఠశాలలో ఇచ్చిన ప్రభుత్వ స్కూల్ బ్యాగులు నాణ్యత లేకపోవడంతో చిరిగిపోవడంతో విద్యార్థులు తమ సొంత డబ్బులతో బ్యాగులు కొనుగోలు చేయక తప్పలేదు.

దుర్గంధం వెదజల్లుతున్న ఆవరణ..

వసతి గృహంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. వసతి గృహం ఆవరణ పల్లంగా ఉండటంతో కొంతమేర మెరక చేశారు. మిగిలిన ప్రాంతంలో వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. రాత్రివేళల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వసతి గృహం ఆవరణలో పశువులు సంచరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వసతిగృహంలోని ఓ విభాగంలో కుళాయిలు పనిచేయడం లేదు. విద్యార్థులు వారి దుస్తులు ఉతుక్కునే ప్రాంతంలో కూడా కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీరు రాకపోతుండటంతో అవస్థలుపడుతున్నారు.



మచిలీపట్నంలోని సమీకృత వసతిగృహంలో సంచరిస్తున్న గేదెలు



సమీకృత హాస్టల్‌లో దుస్తులు ఉతుక్కునే ప్రాంతంలో మరమ్మతులకు గురైన కుళాయిలు

పనిచేయని వాటర్ ప్యూరిఫైయర్..

తాగునీటి కోసం ఓ దాత అందించిన వాటర్ ప్యూరిఫైయర్ పనిచేయకపోయినా మరమ్మతులు చేయించకుండా మూలనపడేశారు. దీంతో విద్యార్థులు కుళాయి నీటినే తాగుతున్నారు. ఇక ఉతుక్కున్న దుస్తులను ఆరేసుకునేందుకు సరైన వసతి లేక ఇబ్బందిపడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. వసతి గృహ భవనాలపై దుస్తులు ఆరేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్యూరిఫైయర్

ఇంటింటా ఫీవర్ సర్వే

గూడూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మురళి సూచించారు. మండలంలోని ఆకులమన్నాడులో ఆరోగ్య సిబ్బంది శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు దోమలకు ఆవాసాలుగా మారితే జ్వరాలు ప్రబలుతాయన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.డి.రఫి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం మార్తారాణి, సీహెచ్ఓ డాలీ సుకన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎమ్మెల్యే సారూ..డ్రైనేజీ సదుపాయం కల్పించండి

పెడన: డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇబ్బంది పడుతున్నందున, తమకు డ్రైనేజీ సదుపాయం కల్పించాలని పెడన జోగానందరావు కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు. పట్టణంలోని జోగానందరావు కాలనీలో శనివారం నిర్వహించిన 'సుపరిపాలన-తొలిఅడుగు'కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి తాము అమలుచేస్తున్న పథకాలు, అమలుచేయబోయే కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఏఇంటికి వెళ్లినా మాకు డ్రయినేజీ నిర్మించాలంటూ కాలనీవాసులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శామలయ్య, రహమాన్‌బేగ్(పూలబాబు), వాహెబ్‌ఖాన్, యర్రా రాజా, బసవ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను కోరుతున్న జోగానందరావు కాలనీవాసులు

లైబ్రరీలకు కంప్యూటర్లు, టీవీలు బహూకరణ

మచిలీపట్నంటౌన్: శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శిక్షణ ఫౌండేషన్ (బెంగుళూరు) సంస్థల సహకారంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన గ్రంథాలయాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ వి.స్వాతిదేవ్ శనివారం స్మార్ట్ మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లను అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 70 శాఖా గ్రంథాలయాలను ఎంపిక చేసి కంప్యూటర్లు, టీవీలు అందజేశామన్నారు. సగం మంది లైబ్రేరియన్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లను అందజేసినట్లు చెప్పారు. ఆయా గ్రంథాలయాలకు రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవీ, ఒక స్మార్ట్ ఫోన్ అందించి ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. గ్రంథాలయాలకు వచ్చే యువత, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఈ డిజిటల్ లైబ్రరీ వ్యవస్థ ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఉప గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ బి.విజయ్‌కుమార్, ఎంవీడీటీ నగేష్, ఐవీవీ రామారావు, శిక్షణ ఫౌండేషన్ బృంద ప్రతినిధులు డి.సత్యనారాయణ, రాజారావు, ఎ.బుచ్చిబాబు, ఎ.కార్తీక్, కార్యాలయ సిబ్బంది, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించిన ఐదుగురు విద్యార్థులు కలిసి గ్రంథాలయానికి ఐదు ఫ్యాన్లను బహూకరించారు.



గ్రంథాలయాల అధికారులకు స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న రవికుమార్, స్వాతిదేవ్ తదితరులు

కేవీకే డెమో యూనిట్ల పరిశీలన



ఘంటసాల: కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లోని డెమో యూనిట్లను శాస్త్రవేత్తలు మరింత అభివృద్ధి చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ సూచించారు. ఘంటసాలలోని కేవీకేను శనివారం ఆయన సందర్శించారు. డెమో యూనిట్లను పరిశీలించారు. సార్వా కార్యాచరణ ప్రణాళికలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు సాధించేలా వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలోసమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కోడూరు: పాముకాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని జరుగువానిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పచ్చ లక్ష్మి(29)ని ఇంటివద్ద పాము కరవడంతో హుటాహుటిన ఆమెను మందపాకల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె మృతితో జరుగువానిపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి.

28న కొబ్బరి చిప్పలు సేకరణ హక్కుల వేలం

మచిలీపట్నంటౌన్: సుల్తానగరంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించే కొబ్బరి చిప్పలను సేకరించుకునే హక్కులకు ఈనెల 28వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో కందుల వేణుగోపాలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు రూ.5వేల ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



పెడన: వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో కలంకారి కార్మికులకు పనులు లేక పస్తులుండటంతో ప్రముఖ కలంకారి వ్యాపారవేత్త మెట్ల దుర్గానాగేశ్వరరావు(చిన్నా) కార్మికులకు శనివారం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు చేతుల మీదుగా 100 మంది కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేశారు. దుర్గానాగేశ్వరరావు సేవానిరతిని కమిషనర్, కౌన్సిలర్ అభినందించారు.

వసతి గృహాలు ప్రభుత్వమే నిర్వహించాలి

గుడివాడ టౌన్: బీసీ సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను పి-4 ద్వారా అభివృద్ధి చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే బీసీ సంక్షేమ గృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. హాస్టళ్ల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని ఉన్నత న్యాయ స్థానాలు అంటున్నాయన్నారు. అట్టి పరిస్థితుల్లో వీటి బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే అవి పూర్తిగా నిర్వీర్యం అవుతాయని తెలిపారు. కావున ప్రభుత్వం ఈ ఆలోచన విరమింపజేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన చెస్ పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ చెస్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్-9 విభాగంలో ఎం. దేవాన్ష్, ఐ. వేదాంత్, ఎం. పర్వాన్ష్ నాగసాయి, అండర్-11 విభాగంలో ఎం. వనోరిసమ్, పి. ఇషిత, ఆర్. వంశీకృష్ణ , అండర్-13 విభాగంలో ఎ. త్రినాథ్, డి. వేద కార్తీక్, ఎ. రహ్మాన్, అండర్-15 విభాగంలో పి. నందకిషోర్, ఎస్‌కె. సమీర్, బి. ప్రవల్లికలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు స్టేడియం పాలకవర్గ సభ్యులు తెలిపారు. వీరితో పాటు జె. వెంకట్ సుజిత్, జె. పునీత్ కుమార్, సీహెచ్ షర్వాన్ ఆదర్శ్, ఎం. లీనా షారోన్, పి. రవికాంత్‌లు ప్రత్యేక బహుమతులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణకుమారి

పెడన: హౌసింగ్ కాలనీల్లో ఇంటి నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎ.అరుణకుమారి ఆదేశించారు. హౌసింగ్ రూరల్ ఏఈ వాహెదాతో కలిసి శనివారం ఆమె తన కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఇంకా 81 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్రప్రభుత్వం అదనంగా మంజూరు చేసిన నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నిధులు డ్రా చేసి ఇంటిని నిర్మించకుండా ఉంటే అటువంటి వారిని గుర్తించి తక్షణం వారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఇంటి నిర్మాణం చేపట్టకుండా ఇతర అవసరాలకు వినియోగించుకుంటే తిరిగి ఆ నిధులు రాబట్టుకునేందుకు రెవెన్యూ యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేయవచ్చునని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి ఆయా ఇళ్ల నిర్మాణపు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఎస్ గంగాధరరావు

కోనేరుసెంటర్: మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఎక్సైజ్‌శాఖ ఉక్కుపాదం మోపుతోందని మచిలీపట్నం ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ గంగాధరరావు తెలిపారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై బలరామునిపేట ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈఎస్ గంగాధరరావు మాట్లాడుతూ యువత గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలు చెడుమార్గంలో నడుస్తున్నట్లు గమనిస్తే తక్షణమే వారిని సన్మార్గంలో నడిచేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగంతో పాటు అక్రమ రవాణా, నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఈఎస్ భార్గవ్, సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ రవి, బలరామునిపేట వాసులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘననివాళి



ప్రగడ కోటయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జగదీష్ తదితరులు

ఘంటసాల: చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య తన జీవితాంతం చేనేతల అభ్యున్నతికి కృషిచేశారని ఏపీ పద్మశాలి సంఘం కోకన్వీనర్ అందె జగదీష్ కొనియాడారు. చేనేత ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రగడ కోటయ్య 111వ జయంతిని జగదీష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి అందె జగదీష్, పంచాయతీ కార్యదర్శి టి.విజయలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సంక్షోభం సమయంలో చేనేత వృత్తులను కాపాడుకునేందుకు ప్రగడ కోటయ్యను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రగడ కోటయ్యకు నివాళులర్పించినవారిలో చేనేత నాయకులు ఉడతా చిత్తరంజన్‌సాయి, అక్కల లీలాప్రసాద్, నందం పవన్‌కుమార్, సచివాలయం, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కార్గిల్ యుద్ధ సన్నివేశాలు మరువలేనివి



మాజీ సైనికులను సన్మానిస్తున్న నాయకులు

మాజీ సైనికుడు, డిపో మేనేజర్ పెద్దిరాజు

మచిలీపట్నంటౌన్: కార్గిల్ యుద్ధసన్నివేశాలు తన జీవితంలో మరువలేనని మాజీ సైనికుడు, ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు పేర్కొన్నారు. 20ఏళ్ల సైనికజీవితం తనకు ఎన్నో తీపిగుర్తులు మిగిల్చిందని ఆయన గుర్తుచేసుకున్నారు. కార్గిల్ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు శనివారం డీఎం పెద్దిరాజును ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ దేశ సంరక్షణలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సేవలు మరువలేనివన్నారు. తన వివాహం జరిగిన మూడు నెలలకే కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నట్లు వివరించారు. తాను చేసిన సేవలకు 'ఉస్తాద్' అనే అవార్డు లభించినట్లు చెప్పారు. దేశ రక్షణ రంగంలో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో తాను గ్వాలియర్ నుంచి పనిచేసినట్లు వివరించారు. సన్మాన కార్యక్రమంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, భారతరంగణి కన్వీనర్ భవిష్య, నోబెల్ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు మద్దాల సువర్ణరాజు, అరిశేపల్లి సొసైటీ విశ్రాంతి సీఈవో మల్లంపల్లి రామాంజనేయులుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డీఎం పెద్దిరాజును సత్కరిస్తున్న బాలాజీ, సువర్ణరాజు తదితరులు

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్..

మచిలీపట్నంటౌన్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా స్థానిక ఆర్‌కే కాలేజీ వద్ద బీజేపీ నాయకులంతా కలిసి మాజీ సైనికులను సత్కరించారు. బీజేపీ కృష్ణాజిల్లా నూతన అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, ఎంయూడీఏ ఛైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ భారతసైన్యం సేవలను కొనియాడారు. అనంతరం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి మాజీ సైనికులకు సత్కరించారు. ర్యాలీలోమాజీ సైనికులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పంతం వెంకటగజేంద్రరావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు గాడెల్లి వసంతరావు, ఆర్‌కే కాలేజ్ ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.